## ప్రభుత్వ రంగాలాలలో వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్ఐ ప్రమాణములు విధిగా పాటించాలి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ రంగాలాలలో వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్ఐ ప్రమాణములు విధిగా పాటించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులు జాయింట్ డైరెక్టర్, టి.సుజాత స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటలకు బ్యాచ్ – 1 (జగ్గంపేట, గండేపల్లి, ఏలేశ్వరం, గొల్లప్రోలు, సామర్లకోట, శంఖవరం మండలాల యొక్క గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు) మరియు మధ్యాహ్నం 01:30 గంటల నుండి సాయంత్రం 05:30 గంటల వరకు కాజులూరు, పెద్దాపురం, యు.కొత్తపల్లి, తాళ్ళరేవు మండలాల యొక్క గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరం, కాకినాడ నందు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ జాయింట్ డైరెక్టర్, టి.సుజాత మాట్లాడుతూ నిత్యావసరాల వస్తువులు మొదలుకుని ప్రభుత్వ రంగాలాలలో వినియోగించే అన్ని వస్తువులకు ఐఎస్ఐ ప్రమాణములు విధిగా పాటించాలని స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రోక్యూర్‌మెంట్ స్టాండర్డ్ ప్రమాణాలు గల వస్తువులు కొనుగోలుకు ప్రాముఖ్యత ఇవ్వాలని శిక్షణలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్‌లోని అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, డి.పి.ఆర్.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17వ
# సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,28 ఫిబ్రవరి 2024


# తుంగలో తొక్కేసిన సుప్రీంకోర్టు ఆర్డర్

- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్
- ఎమ్మెల్యేల నోటి మాటకు విలువ
- అర్చకులకు పంగనామాలు
- దేవాదాయశాఖ అధికారుల అవినీతి లీలలు

**కాకినాడ, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** దేవాదాయశాఖ అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. పైగా బడ్జెట్ల సీజన్ నడుస్తోంది. ఒక్కో ఆలయానికి కనీసం రూ.50 వేల నుంచి పదిలక్షల వరకు బడ్జెట్ మంజూరుకు ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. తాజాగా అర్చకులకు పంగ నామాలు పెడుతున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల ప్రకారం ఐదు లక్షలలోపువార్షికాదాయంఉన్నదేవాలయాలనుఅర్చకులకు అప్పగించాలని కమిషనర్ రాము సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ ఉత్తర్వులు వెలువడి నెలలు గడుస్తోంది. కాకినాడ జిల్లాలో కేవలం 10 ఆలయాలు మాత్రం అప్పగించారు. 76 ఆలయాలు అప్పగించాల్సి ఉంది. ఈ ఆలయాలు అప్పగిస్తే తమకు మామూళ్ళు రావు. తమ మాట చెల్లుబాటు కాదు అనుకున్న ఆ శాఖ అధికారులు హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి వాస్తవం.. కమిషనర్ ఆగమేఘాలపై ఇచ్చేయమన్నారు.. అది నిజమే.. కానీఫలానా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారు.. ఇవ్వొద్దంటున్నారు.. అందుకే ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల కాపీ అడిగితే మౌఖికంగా చెప్పారంటున్నారు. అంటే దేవాదాయశాఖ అధికారులు తమ మామూళ్ళ కోసం, తమ పెత్తనం కోసం ఎమ్మెల్యేల



పేర్లు అడ్డుపెట్టుకుంటూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులను, కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్నారు. కాకినాడ జిల్లాలో పలు దేవాలయాలను ఇలాగేఅప్పగించకుండా ఎమ్మెల్యేల పేర్లు అడ్డుపెట్టుకుని బతికేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత వీరి సంగతి తెలుస్తాం అంటూ అర్చక సంఘాలు చెబుతున్నాయి. కేవలంనోటి మాటకే ఆలయాలు అప్పగించము అని చెబుతున్న అధికారులు అదే ఎమ్మెల్యేలు ఫలానా ఈవోను బదిలీ చేయాలని చెప్పినప్పుడు కమిషనర్ ఆర్డర్, ఏమీ చేయలేం సార్ అని ఇదే అధికారులు చెప్పడం విశేషం. కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్‌కు సంబంధించి కొందరు ఈఓల బదిలీలపై ఎమ్మెల్యే కన్నబాబు సిఫార్సు చేశారు. ఆయన అధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కానీ ఆయన మాటను లెక్కచేయకుండా అదే ఈవోలను కొనసాగిస్తున్నారు. ఆలయాలు అప్పగించడంలో మాత్రం ఎమ్మెల్యేలపై నెపం వేసేస్తున్నారు. ఎన్నికలసీజన్‌కోడ్ వస్తుంది. అప్పుడు ఏం చేస్తారు. ఎమ్మెల్యేల వెంట ఇలాగే పరిగెడతారా అంటూ ధార్మిక సంఘాలు కూడా మండిపడుతున్నాయి. న్యాయస్థానాలు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఐదు లక్షల లోపు వార్షికాదాయం ఉన్న ఆలయాలు అర్చకులకు ఇవ్వాలి. కానీ అధికారులు అడ్డుకుంటున్నారు. ఎమ్మెల్యేల పేరు చెబుతున్నారు. రేపు ఎన్నికలలోఅర్చకులు,బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారం. తమసత్తాకూడాచూపుతాం. ఎవరైతే అడ్డుకున్నారో వారికి వ్యతిరేకంగా ఓటేస్తామంటూ నేరుగా హెచ్చరిస్తున్నారు. ఇది పరిశీలిస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేల ఓటమికి దేవాదాయశాఖ అధికారులు కారణమని తేటతెల్లమవుతుంది. అప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుంది పరిశీలించాల్సిందే. మొత్తం మీద దేవాదాయశాఖ అధికారులు చెబుతున్న మాటలతో అధికార పార్టీపై బ్రాహ్మణ సంఘాలు ఆగ్రహంగా ఉన్నాయి. ఇప్పటికే బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్టీకి రాజీనామా చేశారు. మరోపక్క టీడీపీ,జనసేనపొత్తులోఓబ్రాహ్మణ సామాజికవర్గానికి సీటుకూడా కేటాయించారు. తాజాగా దేవాదాయశాఖ అధికారులు బ్రాహ్మణులకు పంగనామాలు పెట్టడంతో వారంతా అధికార పార్టీకి దూరం అంటున్నారు. ఈపాపం దేవాదాయశాఖఅధికారుదే అంటున్నారు అర్చక, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు.

## ఎన్నికల విధులపై బిఎల్ఓలకు శిక్షణ

- పాల్గొన్న ఈఆర్ఓ వెంకటరావు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రానున్న ఎన్నికలలో బిఎల్వోల పాత్ర అత్యంత కీలకమనికాకినాడసిటీ నియోజకవర్గ ఈఆర్ఓ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఎన్నికల విధులపై బిఎల్ఓ లు, సెక్టార్ అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎన్నికలకు ముందు రోజు, ఎన్నికలు జరిగే రోజున పని చేసే విధానం, ఈవీఎం, వివి ప్యాట్ నిర్వహణ, ఇతర అంశాలపై శిక్షకులు వీరికి అవగాహన కల్పించారు. సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది సందేహాలను నివృత్తి చేసుకొని, సంపూర్ణ అవగాహనతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, గుంటూరు శేఖర్, బి.వి.మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు దరఖాస్తుల పరిష్కారం

- స్పష్టం చేసిన ఈఆర్వో జే.వెంకటరావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ వంతు తోడ్పాటు అందించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం తాజాగా ఫారం 6,7,8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని వివరించారు. ఇప్పటివరకు 10,482 దరఖాస్తులు రాగా 1005 తిరస్కరించామని, 6127 దరఖాస్తులను ఆమోదించామన్నారు.

ఇంకా 3330 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో పుష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను ఈఆర్వో నివృత్తి చేశారు. ఓటర్ల జాబితా పైపత్రికలలో వచ్చిన కథనాలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ల తేదీకి పది రోజుల ముందు వరకూ కొత్త ఓట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎన్నికల కమిషన్ ఆదేశాల అనంతరమే తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటే శ్వరరావు (వైఎస్ఆర్సిపి), తుమ్మల రమేష్ (టిడిపి), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ, గుంటూరు శేఖర్, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఎ.పి.జే.ఎ.సి పిలుపు మేరకు స్థానిక ఎన్జీజీవో హోం నందు మంగళవారం 5గంటలకు నల్ల బాడ్జిలు ధరించి నిరసన చెయ్యడం జరిగినది. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు మాట్లాడుతూ ఈనెల 14వ తేది నుండి 27 వరకు అజీటేషన్ ప్రోగ్రాం ఇచ్చిన సంగతి మీ అందరికీ తెలిసినదేనని గుర్తు చేశారు. 24వ తేదీన ప్రభుత్వం జాయిన్ స్టాఫ్ కౌన్సిలింగ్ మీటింగ్‌ను పెట్టి ఆ మీటింగ్‌లో మనకు రావాల్సినటువంటి ఏరియర్స్ గురించి, 12వ పిఆర్సి గురించి, 01.09 2004 ముందు అపాయింట్మెంట్ అయినటువంటి సి.పి.ఎస్. టూ ఓ.పి.ఎస్. ఉద్యోగుల గురించి, ఎడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంపుదల గురించి, కాంట్రాక్టు ఉద్యోగులను మార్చి ఫస్ట్ వీక్‌లో రెగ్యులరైజ్ చేస్తూ ఆర్డర్స్ ఇవ్వడం వంటి విషయాలలో మినిట్స్ రికార్డ్ చేసి మనకి ఇవ్వడం జరిగిందన్నారు. 25వ తేదిన ఏపీ జేఏసీ సెక్రటేరియట్ సమావేశంలో చలో విజయవాడ ప్రోగ్రామ్ని తాత్కాలికంగా నిలుపుదల చేసి, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల మీద ప్రభుత్వం, పోలీసులు అక్రమ కేసులను వేసినదానికి నిరసనగా 27.02.2024 సాయంత్రం 5 గంటల తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ లందరూ కూడా జిల్లా హెడ్ క్వార్టర్స్ ఎన్జీవో హోమ్స్



నందు సమావేశమై ప్రభుత్వ పోలీస్ కేసులు, పోలీస్ దాడులను నిరసిస్తూ, నిరసన కార్యక్రమం చెయ్యడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, కాకినాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ, మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్ బి.సుజాత, జిల్లా కన్వీనర్ ఎ.దేవి, స్టేట్ కౌన్సిలర్ షేక్ అజీజ్ పాల్గొన్నారు.

## తెలుగు జన విజయకేతన సభకు

## కాకినాడ నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లాలి - కొండబాబు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం నందు 28వ తేదిన నిర్వహించు తెలుగుదేశం, జనసేన పార్టీలు నిర్వహించు తెలుగు జన విజయకేతనం ఉమ్మడి బహిరంగ సభకు కాకినాడ సిటీ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు తరలి వెళ్లాలని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మంగళవారం కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంగా అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ పాలనను అంతమొందించి, ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి సంక్షేమపథకాలు అందించిన చంద్రన్న ప్రజాపాలన తీసుకురావడానికి ఆంధ్ర రాష్ట్రప్రజలుప్రతీ ఒక్కరూ కోరుకుంటున్నారని, జగన్ రెడ్డి ప్రభుత్వం పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి పన్నులు, చెత్త పన్నులు, విద్యుత్ ఛార్జీలతో ప్రజలు ఆర్థికంగా కుదేలయ్యారని, సంక్షేమ పథకం పేరుతో జగన్ రెడ్డి 10 రూ. ఎరచూపి 100 రూ. దోచుకుంటున్నాడని, తాడేపల్లిగూడెంలో రేపు జరగబోయే తెలుగు జన విజయకేతన జెండా ఉమ్మడి బహిరంగ సభ విజయవంతం చేయడం ద్వారా వైసీపీకి ఓటమి సంకేతాలు పంపేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు కాకినాడ సిటీ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమ పరిశీలకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్ని బాలాజీ మాట్లాడుతూ మోసపూరిత మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంతో పాటు ప్రతీ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేలా చేసిందని, వైసిపి దుర్మార్గ పాలన అంతమొందించేందుకు తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలో తీసుకురావడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తాజుద్దీన్, నృసింహదేవర విశ్వనాథం, దండుప్రోలు నాగబాబు, ఒమ్మి బాలాజీ, తుమ్మల సునీత, పలివెల రవి, మీసాల సునీత, సీకోటి ఆప్పిలకొండ, కోపనాతి నాగ కుమారి, దేవు జయలక్ష్మి, బంగారు సత్యనారాయణ, పసగడుగుల శేషగిరిరావు, వాసంశెట్టి చిట్టప్ప, పాలిక నాని, ఎరుపిల్లి రాము, మల్లాడి చిన్నా, చొడిపిల్లి సతీష్, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, పోలిపల్లి జగన్ బుంగా నాగరాజు, పినపోతు రాము, ఓలేటి పాండు, శేరు శ్రీను, బొడ్డు శివాజీ, గొరుసు దుర్గారావు, బూడి ప్రకాష్, కోడూరి పెద్ద, పొంగా బుజ్జి, చొక్కా గిరి, పసుపులేటి వెంకటేశ్వరరావు, మల్లాడి గంగాధరం, కలిదిండి సురేష్, కేలంగి ప్రసాద్, గుమ్మల్ల చిన్న, బొల్లోజు ఉమా తదితరులు పాల్గొన్నారు.

## మారేడుమిల్లిలో 'బాబు సూరిటీ భవిష్యత్ గ్యారంటీ'

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తెలుగు నాడు విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, మారేడుమిల్లి మండల క్లస్టర్ ఇంచార్జి డాక్టర్ పి.రాజ్‌కుమార్ రెడ్డి అధ్వర్యంలో టీడీపీ వాలంటీర్ సురబోయిన సాయికృష్ణ మారేడుమిల్లి మండల కేంద్రంలో "బాబు సూరిటీ భవిష్యత్ గ్యారంటీ" కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కలిపి సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రూ. 3,000 నెలకు నిరుద్యోగ భృతి, రైతులకు, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, మూడు గ్యాస్ సిలిండర్‌లు, ఇంకా అనేక పథకాలు గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

అలాగే తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షులు కసిగాన



వంశీ కృష్ణ, మండల తెలుగు యువత అధ్యక్షులు మండా కుమార్ రత్నాజి, పల్లాల మోహన్ రెడ్డి, ముర్ల ఉదయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నా వ్యాఖ్యలు రాజకీయం చేయొద్దు

- ఎమ్మెల్యే ద్వారంపూడి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఈనెల 17న పత్రికా సమావేశంలో మత్స్యకార జాతిపై తాను పొరబాటున చేసిన వ్యాఖ్యలపై రాజకీయం చేయొద్దని కాకినాడ నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి అన్నారు. తన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నానని, కాకినాడలో అన్ని కులాలు, మతాలు ప్రజలు అంతా తనకు సమానమేనన్నారు. మత్స్యకార వర్గం అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నానని అన్నారు. తన వ్యాఖ్యల పట్ల మనస్ఫూర్తిగా క్షమాపణలు చెపుతున్నానన్నారు. అన్యథా భావించవద్దని, ఎన్నికలసమయంలోఈవ్యాఖ్యలపై కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో లబ్ధిదారులకు అందేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, గడువులోగా దరఖాస్తులను పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి క్లైమ్ ల పరిష్కారం పురోగతి, బాధిత కుటుంబ సభ్యులకు మరణం, ఎఫ్ఐఆర్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పోస్టుమార్టం రిపోర్టులు వంటి ఇతర అర్హతలకు సంబంధించిన ధృవపత్రాల జారీలో చోటుచేసుకుంటున్న జాప్యంపై జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ కృతికా శుక్లా.. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య ఆరోగ్యం, పోలీస్, జీజీహెచ్, పంచాయతీ శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5 లక్షలు, సాధారణ మరణానికి ఒక లక్ష నామినిగా నమోదు కాబడిన వ్యక్తి బ్యాంకు ఖాతలో నేరుగా డీబీటీ పద్ధతిలో సొమ్ము చేస్తుందన్నారు. బాధిత కుటుంబీకులకు సత్వరం ఆర్థిక సహాయం అందించేందుకు వీలుగా మృతుని యొక్క మరణం, ఎఫ్ఐఆర్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ, పోస్టుమార్టం రిపోర్టులు వంటి ఇతర అర్హతలకు సంబంధించిన ధృవపత్రాలను సకాలంలో జారీ చేయాలన్నారు. ఈ క్లైమ్‌లకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు వైఎస్సార్ బీమా పథకం కింద 757 క్లైమ్ లకు సంబంధించి రూ.10.81 కోట్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని మిగిలిన దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయాని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎంజేవీ.భాస్కరరావు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ నగర పాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జే.నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ డా. స్వప్న, జీజీహెచ్ ఆర్ఎం డా. అనిత, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'జీడిపిక్కల' యూనిట్లు ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకారం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువతీయువకులు, అర్హులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నుండి జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మంగళవారం తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువతీ యువకులు జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారు వారి కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్‌కార్డ్, విద్యార్హతలకు సంబంధించిన జిరాక్సులు, దరఖాస్తుతోపాటు ఏజెన్సీ ఏడు మండలాల వెలుగు ఏపీఎంలకు, ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లోను వేయాలని ఆయన తెలియజేసారు. జీడిమామిడి పిక్కలు ప్రాసెసింగ్ యూనిట్ కు సంబంధించి ఒక యూనిట్ విలువ రూ.10 లక్షలు పైబడి ఉంటుందని, ఇందులో ఆటోమెటిక్ అదేవిధంగా మాన్యువల్ మిషన్లు ఉంటాయని ఆయన తెలిపారు. యూనిట్ మొత్తం విలువలో 50శాతం ఐటిడిఎ నుండి మంజూరు చేయడం జరుగుతుందని, అదేవిధంగా 50శాతం బ్యాంకు రుణాల ద్వారా మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ నుండి మార్చి 6వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 93916 90144లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా ఉపాధి హామీ పనులు ప్రారంభం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** యెంట్రుకోన గ్రామంలో యేములమ్మ చెరువును జాతీయ ఉపాధి హామీ పథకంలో 9 లక్షల 60 వేల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ కొబ్బరి కాయ కొట్టి ఉపాధి హామీ మేట్స్‌తో పని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలం ఎపివో శ్రీను, పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీరామ చంద్రమూర్తి, సిబ్బంది పెద్దిరాజు వేమలరావు, రెవిన్యూ డిపార్ట్‌మెంట్ రెడ్డి, సచివాలయం ఉద్యోగస్తులు, హెల్త్ డిపార్ట్మెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ మంగాదేవి మరియు ఉపాధి హామీ మేట్స్ పాల్గొన్నారు.

## జనసేన - టీడీపీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**- పార్లమెంట్ ఇంచార్జ్ డిఎంఆర్ శేఖర్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** 28వ తేదీ బుధవారం తాడేపల్లిగూడెంలో జరుగు జనసేన - తెలుగుదేశం ఉమ్మడి బహిరంగ సభకు మన అమలాపురం నుండి ఇరుపార్టీల నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని జనసేన నాయకులు డి.ఎం.ఆర్. శేఖర్ విజ్ఞప్తి చేశారు. అమలాపురం శుభగృహాలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఛలో తాడేపల్లిగూడెం జెండా పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. అందరం తాడేపల్లిగూడెం తరలి వెళ్ళేందుకు సిద్ధం కావాలని డి.ఎం.ఆర్. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల సతీష్, నాయకులు నల్లా శ్రీధర్, కంచిపల్లి అబ్బులు, ఇసుకపట్ల రఘుబాబు లింగోలు పండు, ఆర్.డి.ఎస్. ప్రసాద్, కొప్పుల మానస, పరమట చిట్టిబాబు, భట్టు పండు, పోలిశెట్టి బాబులు, దున్నాల వేణు తదితరులు పాల్గొన్నారు.

# నేడే కాకినాడలో కెజి బేసిన్ చమురు,గ్యాస్‌పై రౌండ్ టేబుల్ సమావేశము

**- అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యే రావాలి**

**- భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన - తాటిపాక మధు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుండి 2024, జనవరి 7న ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమయింది. క్రిష్ణా గోదావరి బేసిన్‌లో గ్యాస్ తోపాటుగా చమురు ఉత్పత్తి విలువ కొన్ని లక్షల కోట్లకు మించి ఉంటుంది. ఆంధ్ర తీరంలో వున్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చబోతున్నాయి. మన తీర ప్రాంతంలో చమురు ఉత్పత్తి ఆంధ్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి చాలా కీలకమైనదన్న ముఖ్యంగా కాకినాడ ప్రజలకు జీవనదిలాంటిది అన్ని పరిశ్రమలకు గ్యాస్ పంపిణీ చేయవచ్చు. ఇలాంటి తరుణంలో బుధవారము ఉదయం 10. 30 గంటలకు స్థానిక గాంధీభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశము జరగనుందని దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ హాజరవుతున్నారని కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి కే.బోడకొండ సముక్తంగా పిలునిచ్చారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు హాజరవుతూరని మధు తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రపంచంలో




ఏ ప్రాంతంలో నైనా స్థానికంగా లభ్యమయ్యే సహజవనరులను ఉపయోగించుకునే హక్కు ఆ ప్రాంతానికే వుంటుందనేది సహజ న్యాయ సూత్రం అన్నారు. సహజవనరులు ఏ రాష్ట్రంలో వుంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పిందని, మన అవసరాలు తీర్చకుండానే 1500 కి.మీ. దూరానవున్న గుజరాత్, మహా రాష్ట్రకు మన తీరం నుండి గ్యాస్ ను తరలిస్తూ ఆంధ్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మధు అన్నారు. ఆంధ్ర ప్రాంతానికి న్యాయమైన గ్యాస్ కేటాయింపుల కోసం, న్యాయమైన ధర కోసం, న్యాయమైన 50 శాతం లాభం వాటా కోసం వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా తీవ్రంగా కృషి చేశారని, ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవ తీర్మానాలు చేశాయని, అయినా గ్యాస్ కేటాయింపులు, ఆదాయంలో సగం పొందలేకపో యామన్నారు.

గ్యాస్‌ను కొట్టేయటమే కాకుండా చమురు పై దృష్టి సారించారని, కేజీ బేసిన్‌లో చమురు ఉత్పత్తి ప్రారంభం కాగానే కేంద్ర ప్రభుత్వాధినేత మోడీ, ఉత్తరభారతదేశ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా విపరీత ప్రచారాన్ని ఇచ్చారని, ఆంధ్రదేశం స్పందించలే దన్నారు. ప్రభుత్వ అండతో సహజవనరులు రిలయన్స్ లాంటి కార్పొరేట్ కంపెనీల పాలవుతున్నాయన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయపూనుకున్నారన్నారు. కేజీ బేసిన్ లోని చమురు, గ్యాస్‌లపై మన వాటాను సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని, జరుగుతున్న మోసం గురించి అవగాహన వున్న అన్ని వర్గాల ప్రజలు కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నామన్నారు. సహజ వనరులలో మన హక్కుల గురించి ఎన్నికల ప్రచారంలో, ఎన్ని కల మానిఫెస్టోలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరుతున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన రావిపాటి వెంకటేష్ (29) రాజమండ్రి అపోలో ఫార్మసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పేరవరం నుండి రాజముండ్రి వెళ్ళుచుండగా, బొబ్బర్లంక బ్యారేజ్‌పై ఎదు రుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసు తెలిపినారు.

## ఆరోపణలు అవాస్తవం

**- సర్పంచ్ గెడ్డం సుధ**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తులు సంబంధించిన అప్లికేషన్లు ఈ పోర్టల్‌లో తిరస్కరిస్తున్నట్టు వచ్చిన ఆరోపణ వాస్తవం కాదని ఆత్రేయపురం సర్పంచ్ గెడ్డం సుధ అన్నారు. బీజేపీ కి చెందిన కలాబత్తుల చిన్నారి ఆరోపిస్తున్నవన్నీ అవాస్తవం అని, ఆమె నాకు ఎటువంటి అప్లికేషన్లు ఇవ్వలేదు అని, ఏ విధమైన అప్లికేషన్లు నాకు ఇవ్వకుండా గ్రామ ప్రథమ పౌరురాలైన నాపై వ్యక్తిగతంగా చేస్తున్న నిరాధారమైన ఆరోపణలు అవాస్తవమని తెలిపి, ఆమె నాకు బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే ఆమెపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## మినీ వ్యాన్‌లో తరలిస్తున్న జిట్రేగి మంచాల పట్టివేత





**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి నుండి అక్రమంగా తరలిస్తున్న 4 జిట్రేగి మంచాలను చింతూరు అటవీశాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది సోమవారం రాత్రి ముందస్తు సమాచారం మేరకు వలవేసి పట్టుకున్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారి గొర్రె చిన్నబిక్షం తెలిపిన వివరాలు ప్రకారం పోల్లూరు జంక్షన్ వద్ద జరిపిన వాహనాలు తనిఖీలలో డొంకరాయి గ్రామానికి చెందిన గంగిరెడ్ల అనిల్ కుమార్, గూడెన శివ అనే వ్యక్తులు అశోక్ లేలాండ్ మినీ వాహనంలో (ఎపి 31 టిసి 6289) చింతూరు వైపు వస్తుండగా పక్క సమాచారం మేరకు పట్టుకున్నా మని తెలిపారు. ముద్దాయిల ఇద్దరిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి కోర్ట్‌లో హాజరపరచుతున్నట్లు, అటవీ ఫలసాయాన్ని స్వాధీనపం చుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.1,36,646 ఉన్నదని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.వి.వి.ఎస్.ఎస్.మూర్తి, కల్లెరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే.వీరయ్య, సిబ్బంది నుపా రవి, జోగారావు, పెనబెల్లి వీర్రాజు, రవ్వ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే నిర్వహించండి - ఎంపిడిఓ



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపిఎం లకు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే చేయు విధానంపై ఆన్లైన్ శిక్షణ అనంతరం ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ క్షేత్ర స్థాయిలో సర్వే ఏ విధంగా చేయాలి అనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. మండలంలో గల విక్టరీ బజార్, గో ఫ్రెష్, కొబ్బరి పీచు, డొక్క సుడి, హచేరీలు వంటి వాటి స్థితిగతులు, వారికి ఇంకా ఎటువంటి ప్రభుత్వ సహాయం అవసరం అనే అంశాలపై ప్రత్యేక యాప్ ద్వారా ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ మార్చ్1నుండిసమగ్రసర్వేనిర్వహించాలని ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జగనన్న పాల వెల్లువ పథకంలో ఎంపికైన 9 సచివాలయాల పరిధిలో మార్చ్ నెలలో రైతుల నుండి పాల సేకరణ ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఏపిఎం సయిూద్‌కు ఎంపిడిఓ సూచించారు. పాల సేకరణ సంఘాలవారికి షెడ్యూల్ ప్రకారం అవగాహనా సమావేశాలు నిర్వహించి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యదర్శులుశ్రీనివాస్, రాజా, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ స్పందన, దివ్య, రోజా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లు సందర్శించిన ఈఆర్వో



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో జె.వెంకటరావుమంగళవారంపలుపోలింగ్ స్టేషన్లను సందర్శించారు. గాంధీనగర్, రామారావుపేట, రామకృష్ణారావుపేట, రేచర్లపేట, దుమ్ములపేట, శ్రీరామ్‌నగర్, జగన్నాథపురం,రాగంపేట, సినిమా రోడ్డు ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కొన్ని పీఎస్‌లకు గతంలో ఉన్న పేర్లు మారిన నేపద్యంలో వాటి వాస్తవికతను స్వయంగా నిర్ధారించుకున్నారు. అందుకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్ళి ప్రస్తుతం ఉన్న పేర్లను ఆయా పోలింగ్ స్టేషన్లకు ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు.

అదే సమయంలో ఆయా పోలింగ్ స్టేషన్లలోని వసతులను కూడా ఆయన పరిశీలించారు.

## జిల్లాలో మాదిగలకు ఒక్క స్థానం కూడా కల్పించలేదని నాయకుల ఆవేదన

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లాలో తెలుగుదేశం పార్టీ మాదిగలకు సముచిత స్థానం కేటాయిస్తుందని ఎదురు చూసిన మాదిగ సామాజికవర్గానికి ఈసారి కూడా నిరాశే ఎదురైందని నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు ఆవరణలో మాదిగ సామాజకవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ళ కిషోర్ అద్యక్షత జరిగిన తెలుగుదేశం పార్టీ మాదిగ సామాజికవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు ఉపయోగపడే ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ చేసారనే కృతజ్ఞత మాదిగలకు ఉందని ఆకారణంగానే తెలుగుదేశం పార్టీకి మాదిగలు వెన్నంటి ఉంటున్నామన్నారు. మాదిగ సామాజికవర్గ ఓట్లు అమలాపురం పార్లమెంటు పరిదిలో రమారమీ లక్షా పాతిక వేల ఓట్లు ఉన్న మాదిగలు ప్రతీ నియోజకవర్గంలోనూ రమారమీ 15 నుండి 20 వేల ఓట్లు ఉన్నాయన్నారు.

2024లో కోనసీమలో ఏదో ఒక నియోజకవర్గం మాదిగలకు కేటాయిస్తుందనకున్నామని, ఈసారి కూడా మాదిగలకు తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు ఇవ్వలేదని ఈ విషయమై తెలుగుదేశం పార్టీ నాయకత్వం పునఃపరిశీలించాలని సమావేశం కోరింది. మాదిగలు తెలుగుదేశం పార్టీకి పూర్తిస్ధాయిలో పనిచేసేలా పార్టీ సముచిత నిర్ణయం



తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేసారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ హెచ్ ఆర్డీ సభ్యుడు దళితరత్న నేదునూరి వీర్రాజు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నేదునూరి వెంకటరమణబాబు, పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సవరపు శ్రీనివాసరావు, గన్నవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి పెదపూడి రాము, నాయకులు మంద రాజేష్, నేదునూరి పెద్దిరాజు, మంద నాగరాజు, తొత్తరమూడి గోవింద్, యార్లగడ్డ వెంకట్రావు, నేదునూరి బాబులు,ఉందుర్తిరాజేష్, చోడే విజయ్, చాపల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా నుంచి 40 బస్సుల్లో 2,600 మంది రాజ్ నాథ్ సింగ్ మీటింగ్‌కు ప్రయాణం

**- చిలుకూరు రామ్‌కుమార్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** మంగళవారం మధ్యాహ్నం 4 గంటలకు ఏలూరులో జరగనున్న ఉమ్మడి తూర్పుగోదావరి పశ్చిమగోదావరి జిల్లాల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కాకినాడ జిల్లా నుంచి 2,600 మంది కార్యకర్తలు 40 బస్సుల్లో ప్రయాణం అయ్యారని కాకినాడ జిల్లా అధ్యక్షులు చేసి చిలుకూరు రామ్‌కుమార్ చెప్పారు. అందులో కాకినాడ నుంచి ఐదు బస్సుల్లో రెండు వందల మంది కార్యకర్తలు స్థానిక అచ్చంపేట జంక్షన్ నుంచి మంగళవారం ఉదయం 11 గంటలకు బయలుదేరారని ఆయన చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు కేవలం బూత్ స్థాయి అధ్యక్ష కార్యదర్శులు, బిఎల్వోలు, శక్తి కేంద్ర ఇన్చార్జులు మాత్రమే ఈ సమావేశానికి తరలివస్తున్నారని, వారికి రాజనాథ్ సింగ్ రానున్న ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేస్తారని చిలుకూరి చెప్పారు. స్థానిక అచ్చంపేట జంక్షన్ దగ్గర కాకినాడ నగరం నుంచి బయలుదేరిన ఐదు బస్సులకు కాకినాడ జిల్లా ఇన్చార్జి రావూరి సుధ, కాకినాడ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పైడా వెంకటనారాయణ, మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం



బస్సులకు జెండా ఊపి కార్యకర్తలను ఏలూరు పంపారు. జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులు ఇప్పటికే వారి వారి సొంత వాహనాల మీద ఏలూరు చేరుకున్నారు. కాకినాడ నుండి బయలుదేరు బస్సులకు కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కెల్లి గడ్డ గంగరాజు, గట్టి సత్యనారాయణ, ముసలి గంటి సురేష్ నాయకత్వం వహిస్తారని చిలుకూరి చెప్పారు. కాకినాడ నగరంలో ఐదు మండలాల అధ్యక్షులు చెక్క రమేష్, గుండోజు బానోజీరావు, పుణ్యపు రంగనాథ్, గాలిదేవర శేఖర్ తోపాటు ఏడిద కృష్ణ, పెండం శ్రీదేవి, నక్క రాణి తదితరులు ఉన్నారు.

## టిడిపి జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం రసాబాస





**- టిడిపి నాయకుడు హరీష్ మాధుర్ జనసేన సైనికులు మధ్య తోపులాట**

**- హరీష్ కారు అద్దాలు, కుర్చీలు ధ్వంసం**

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం నియోజకవర్గం అభ్యర్థిని మార్పు చేయాలని లేని పక్షంలో టిడిపి నాయకులు జనసేన నాయకులు సహకరించేది లేదనిఅభ్యర్థులను ప్రకటించిన నాటినుండి అసంతృప్తులు వ్యక్తమయ్యాయి. పి.గన్నవరం నియోజవర్గ టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ఉమ్మడిఅభ్యర్థిగామహాసేన రాజేష్‌నిప్రకటించడంతో టిడిపి నాయకులు, జనసైనికులు ఆందోళన వ్యక్తం చేసారు. దీంతోపి.గన్నవరం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసారు. అంబాజీపేట వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సృజన కృష్ణ రంగారావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సమావేశంలో రంగారావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు అభ్యర్థులను కలిసి ప్రకటించారని, అభ్యర్ధులను గెలిపించేందుకు టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి కృషి చేయాలన్నారు. హరీష్ మాట్లాడుతూ అసెంబ్లీ అభ్యర్థిత్వ విషయంలో ఉమ్మడి పార్టీల అధిష్టానం ఆదేశాల మేరకు ప్రకటించడం జరిగిందని వివరించే సమయంలో టిడిపి నాయకులు, జనసైనికులు ఒక్కసారిగా మార్పు చేయాలని లేనిపక్షంలో సహకరించేది లేదని, నియోజకవర్గంలో కష్టపడి పనిచేసిన నాయకులకు అభ్యర్థిత్వం ప్రకటించకుండా ఎక్కడనుండో తీసుకువచ్చిన మహాసేన రాజేష్‌కు కేటాయించడమేటిని మండిపడ్డారు.

టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆధిక సంఖ్యలో చేరుకుని అభ్యర్థిని మార్పు చేయాలని ఆందోళన వ్యక్తం చేసారు. అదేసమయంలో హరీష్‌కు నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఆవేశంతో ఉన్న నాయకులు సమావేశంలో ఉన్న కుర్చీలు, కళ్యాణ మండపం కిటికి అద్దాలు, హరీష్ కారు అద్దాలను ధ్వంసం చేసారు. పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను నివారించారు. అనంతరం మీడియా సమావేశంలో రంగా రావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు అభ్యర్థులను కలిసి ప్రకటించారని, నాయకులు సమన్వయం పాటించాలని అన్నారు. ఇక్కడ జరిగన విషయాలను ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానానికి వివరిస్తానని అన్నారు. హరీష్ కారును నాయకులు ధ్వంసం చేయడంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు అటువంటిది ఏమీలేదు అందరూ సమన్వయంతో ఉన్నారని హరీష్ సమాధానం చెప్పారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

**- నలుగురు మావోయిస్టులు మృతి**





**చింతూరు, మేజర్ న్యూస్ :** ఛత్తీస్‌ఘడ్ బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో బడే తుంగలి-ఛోటే తుంగలి అడవిలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటేతుంగలి, బడే తుంగలి అటవీప్రాంతంలో ప్లాటూన్ కమాండర్ ఆఫ్ కంపెనీ నంబర్ 2, జనతా సర్కార్ ప్రెసిడెంట్ మరియు భైరామ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన 40-50 మంది మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో, డిఆర్‌జి సంయుక్త బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌పై బస్తర్ ఫైటర్, సిఆర్‌పిఎఫ్ దండకారణ్యాన్ని జల్లెడ పట్టసాగారు. మంగళవారం ఉదయం ఆపరేషన్ సమయంలో, బడే తుంగలి ఛోటే తుంగలి అడవులలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మరణించారు. పోలీసులు సంఘటన స్థలం నుండి ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంటెన్సివ్ పెట్రోలింగ్ సోదాలు కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

## కృపా గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని పట్టుచీర గ్రామంలో కృపా గాస్పెల్ చర్చ్ పాస్టర్ ఉయక పీటర్ సింగయ్య ఆధ్వర్యంలో సిద్దిపేట జి.బి.యం. మినిస్ట్రీస్ వారిచే ఉచిత వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు వచ్చి ప్రముఖ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్యం, మందులు అందించడం జరిగింది. ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు రంబాల నాగేశ్వరరావు పాల్గొన్నారు. చుట్టు పక్కల పరిసరాల గ్రామాలైన పట్టుచీర, కన్నాపురం, రంగాపురం, కొత్తూరు, కృష్ణవరం ప్రజలు వైద్యం సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జి బి.ఎం. డైరెక్టర్ జెస్సి, కో-ఆర్డినేటర్ రవి, డాక్టర్ జోయెల్ బాబు, డాక్టర్ సరోజ, నీరజ నిస్సీ, సంకీర్తన రాజేష్ రాజు, హానిక్ సుధాకర్, ఆశీర్వాదం, ప్రసాదు, శ్రీకాంత్, పాస్టర్ సురేష్,పాస్టర్ యేసు బాబు, పాస్టర్ భీమయ్య, పాస్టర్ రాబర్ట్, పాస్టర్ కృపారావు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రకటన

నా క్లయింటు కాకినాడ జిల్లా, సామర్లకోట పట్టణం సత్యనారాయణపురం డోర్ నెం. 15-5-1 కాపురస్తులు మట్టపల్లి రామలింగేశ్వరరావు కుమారుడు మట్టపల్లి సూర్యచక్రగంగా శ్రీనివాస్ గారు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్, మెయిన్‌రోడ్డు, డోర్ నెం. 8-6-4 కాపురస్తులు అద్దేపల్లి మృత్యుంజయుడు గారి భార్య అద్దేపల్లి శకుంతల గారి వద్ద నుండి ఈ దిగువ షెడ్యుల్ దాఖలా ఆస్థిని క్రియం పొందుటకు నిర్ణయించుకున్నారు. కావున ఈ ఆస్థిపై ఎవరికైననూ, ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ లగాయితు 7 రోజులలోగా తెలియపరచవలెను. అట్లు తెలియపరచని యెడల ఏ విధమైన అభ్యంతరములు లేని నిష్పేచి ఆస్థి అని భావించి నా క్లయింటు క్రియం పొందగలవాడు. తదుపరి వచ్చిన అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూల్ : తూ॥గో॥ జిల్లా ప్రస్తుత కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం డోర్ నెం. 5-6-3 సదరు హద్దుల మధ్యస్థమైన చ॥గ॥ స్థలం 281 చ॥గ॥లు ఇల్లు.

షెడ్యూలు :

తూర్పు : నల్లం వెంకటరామచంద్రరావు (వగైరాలు)
పడమర : మెయిన్‌రోడ్డు
ఉత్తరం : కంచర్ల గుప్త
దక్షిణం : కంచర్ల నాగేశ్వరరావు

పిడుగు పాపారావు,
బి.కామ్.,బి.ఎల్.
అడ్వకేట్
కాకినాడ.
9246691637

## అన్యం రాంబాబుకు మున్సిపల్ వైస్ చైర్మన్ అభినందనలు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గెడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన అతిథి పత్రిక 10వ వార్షికోత్సవ సభలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన వారికి ఎక్సలెన్సీ అవార్డ్స్ అందించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగంలో కోనసీమలో బ్రిడ్జిలు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్లు నిర్మించినందుకు డాక్టరేట్ చేస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్, సాయి సంజీవిని వాకర్స్ యోగ ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షులు, శ్రీ శ్రీ కళావేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు రుద్రరాజు వెంకటరాజు (నాని రాజు) మంగళవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాని రాజు మాట్లాడుతూ అంకితభావంతో అందరిని కలుపుకుంటూ నిజాయితి చిత్తశుద్ధితో తనదైన ముద్రతో సేవాభావంతో కోనసీమలో రహదారులకు, వంతెనలకు కొత్త వెలుగు తెస్తున్న రాంబాబు సేవలు అపూర్వమని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం హైదరాబాద్ పట్టణం జూబ్లీ హిల్స్‌కు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు,లీలా దంపతులు రూ. 1,11, 116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# పిఠాపురంలో పొలిటికల్ వ్యూహం...

- సీటు దక్కకుంటే స్వతంత్రంగా పోటీ చేసేందుకు స్కెచ్ వేసిన వర్మ
- వివిధ సంఘాల నాయకులు, యూనియన్లే టార్గెట్‌గా పావులు
- ఆటో యూనియన్ చేరికలు

అంటూ హడావుడితో బయటపడ్డ వ్యూహం

- నియోజకవర్గంలో నానాటికి బలహీనపడుతున్న టీడీపీ

పిఠాపురం,మేజర్‌న్యూస్ : సీటు దక్కకుంటే స్వతంత్రంగా పోటీ చేసేందుకు ఎస్వీఎస్ఎన్ వర్మ పావులు కలుపుతున్నారా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. అందుకు ఆయన అమలు చేస్తున్న పొలిటికల్ వ్యూహాలే తార్కాణంగా కనిపిస్తున్నాయి. తనకు అనేకమంది ప్రజలు యూనియన్లు, నాయకులు మద్దతుగా నిలుస్తున్నారు అంటూ... చెప్పుకునేందుకు తెర వెనుక పొలిటికల్ వ్యూహం అమలు చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పిఠాపురంలో వాస్తవానికి వైఎస్ఆర్సిపి, జనసేన పార్టీలు రోజురోజుకు బలపడుతున్నాయి. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నానాటికి బలహీనపడుతూ వస్తుంది.

**-తనకుబలంలేకపోయినా...** బలం ఉందని చెప్పుకునేందుకు పిఠాపురం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినిపిస్తుంది. అందుకు తగినట్టుగా ఆయన తెర వెనుక సిద్ధం చేస్తున్నారట. పిఠాపురం పట్టణంలో మంగళవారం చేపట్టిన ఆటో యూనియన్ల చేరిక కార్యక్రమంలో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఆటో యూనియన్ నాయకులకు లక్షల్లో డబ్బులు అందించి... కార్యక్రమాన్ని



జరిపించారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఏదో భోజనాలు కార్యక్రమం అంటే వచ్చామని, ఇక్కడకు వచ్చిన తర్వాత పార్టీలో చేరికలు అంటూ హడావుడి చేశారని పలువురు ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 13 యూనియన్లు పేర్లు చెప్పి కేవలం ఇద్దరు నాయకులు మాత్రమే రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను యూనియన్ల నుండి సభ్యులుగా తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగి మమల్ని తీసుకొచ్చారని, మరికొద్ది రోజుల్లో మా యూనియన్ల అన్ని వైఎస్ఆర్సిపి లో చేరడం ఖాయమని సమావేశానికి వచ్చిన పలువురు ఆటో డ్రైవర్లు చెప్పడం ఆసక్తికరంగా మారింది. పిఠాపురం నియోజకవర్గం వ్యాప్తంగా మరికొన్ని సంఘాలకు, యూనియన్లకు ఇదే విధంగా ఆఫర్ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కాపు సామాజిక వర్గం బలంగా ఉన్న పిఠాపురంలో జనసేనకు సీటు దక్కే అవకాశం ఉన్న నేపథ్యంలో... తనకు కూడా బలం ఉందని చెప్పుకునేందుకే మాజీ ఎమ్మెల్యే తెరవెనకరచిస్తున్నారనిరాజకీయవిశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పుడే స్థానికుడనని, మిగతా వారంతా స్థానికేతరులని చెప్పడంతో ఆటో యూనియన్ సభ్యులు అవాక్కయ్యారు.ఆటోయూనియన్ సభ్యులకు కళ్యాణమండపం అంటూ... మండపరాజకీయాన్ని మరొకసారి తెరమీదకు తీసుకురావడం ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణం ఆటో డ్రైవర్లకు ఇబ్బందిగా మారిందని, ఏపీలో టీడీపీ జనసేన అటువంటి హామీ ఇచ్చే అవకాశం ఉన్నందున... అది లేకుండా చేయగలరా అని అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేకపోవడంతో ఆటో యూనియన్ సభ్యులు నిరుత్సాహానికి గురయ్యారు.

మీకు సీటు వస్తే మీకే చేస్తాం అంటూ ఒక యూనియన్ నాయకుడు చెప్పడంతో... అలాగైనా... ఎలాగైనా... ఏదో విధంగా విజయం మనదేనంటూ... చెప్పడంతోతనసీటుపైతానేస్పష్టంగా చెప్పలేకపోయారు పోయారు అంటూ సభ్యులు మాట్లాడుకోవడం వినిపించింది.ఎన్నికల సమీపిస్తున్న వేళ సీట్లు కేటాయింపు జరుగుతున్న సందర్భంగా తనకు బలం ఉందని చెప్పేందుకే ఆపసోపాలు పడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన దేవదాయ శాఖ అధికారులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో గల మహారాణి సత్రం నందు మంగళవారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ బాబునాయుడు, మహారాణి సత్రం కార్యనిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌లు ప్రారంభించి, మాట్లాడుతూ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. కంటి వైద్య శిబిరం కన్వీనర్ కార్తిక్ తెలుపుతూ కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన వార్కి అవసరమైన వార్కి ఆపరేషన్లు, కళ్ళజోళ్లుపంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజుబాబు, కుమార్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటకు జనసేన సీటు కేటాయించలేదని భావోద్వేగంతో జరిగిన పొరపాటు

- పవన్ కళ్యాణ్ అంటే అమితమైన అభిమానం
- పవన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీకి ఎమ్మెల్యే బండారు శ్రీనివాస్‌కు సీటు కేటాయించలేదని భావోద్వేగంతో ఆలమూరు కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు ధ్వంసం చేశామని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. అయితే తమకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అంటే అమితమైన అభిమానమన్నారు.ఆలమూరు జనసేన పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో రెండు రోజుల క్రితం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన సంఘటన దురదృష్టకరమని ఈ సంఘటనతో ఎవరి ప్రమేయం లేదని కేవలం తాము భావోద్వేగానికిలోనై ఫ్లెక్సీలను ధ్వంసం చేసామని జనసేన నాయకులు చల్లా బాబీ, గుత్తుల నాగేశ్వరరావు అన్నారు. తాము చేసిన తప్పును సరిదిద్దుకోవడంలో భాగంగా పవన్ కళ్యాణ్ కు క్షీరాభిషేకం చేశారు.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ల సూచన మేరకు వారి అడుగుజాడల్లో తమ నడవడానికి సిద్ధంగా ఉన్నావని ఆలమూరు మండల జనసేన పార్టీ నాయకులు సంగీత సుభాష్, తాళ్ల డేవిడ్, తోట వెంకటేశ్వర్లు, గంటా స్వయంప్రకాష్, మాకినీడి బాబీ, యేపూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన జాబ్‌మేళా



**చింతూరు,మేజర్‌న్యూస్ :** చింతూరు ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించినజాబ్‌మేళావిజయవంతమైంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం చింతూరు ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రంపేట ఏపిఆర్ స్కూల్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఏ పిఓ కావూరి చైతన్య, చింతూరు ఏఎస్పి రాహుల్ మీనా హాజరయ్యారు.ఈ జాబ్‌మేళాలో సికిల్ సెల్ ఎనీమియా టెస్ట్ క్యాంప్ నిర్వహించి సికెల్ సెల్ ఎనీమియా టెస్టులు జాబ్ మేళాకు వచ్చిన 36 మందికి టెస్ట్ చేయటంతో నలుగురికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. సికెల్ ఎనీమయా గురించి యువతకు అవగాహన పరచడం జరిగినది. అదేవిధంగా ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించి కొత్తగా 50 మందికి ఓటర్ రిజిస్ట్రేషన్ చేయటం జరిగినది. ఈ జాబ్ మేళాను ఉద్దేశించి పిఓ మాట్లాడుతూ యువత ఈ గొప్ప అవకాశం సద్వినియోగ పరుచుకుకోవాలని, ఇటువంటి జాబ్ మేళాలు మరిన్ని నిర్వహించి ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా వచ్చే విధంగా చూస్తామని అన్నారు. ఈ జాబ్‌మేళాలో మొత్తం 12 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్‌మేళా లో 454 మంది రిజిస్ట్రార్ అవ్వగా 311 మంది హాజరు కాగా 144 మంది ఉద్యోగాలకు, 48 మంది రెండో విడత ఇంటర్వ్యూకు ఎంపిక కావడం జరిగినది. ఈ కార్యక్రమంకి జిల్లా ఉపాధి అధికారి సంగీత, జిల్లా నైపుణ్యబివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్, ఏపీ స్టేట్ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ చిన్ని, కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా నైపుణ్యవృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందినవారికి నియామక పత్రాలు అందజేసి వారిని అభినందించారు.

## భారీగా తరలి వెళదాం..సత్తా చాటుదాం

- దేశం, జనసేన శ్రేణులకు మెట్ల పిలుపు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** బుధవారం తాడేపల్లిగూడెంలో జరుగు జనసేన - తెలుగుదేశం ఉమ్మడి బహిరంగ సభకు మన అమలాపురం నుండి దేశం, జనసేన నేతలు తరలి వెళ్లి విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు పిలుపునిచ్చారు. తెలుగుదేశం, జనసేన శ్రేణులు ఒక్కటిగా కదలి ఉమ్మడి బహిరంగ సభ ను విజయ వంతం చేసి మన సత్తా చాటాలన్నారు. అమలాపురం నుండి వెళ్ళేందుకు ఆయా నేతల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయన్నారు. ఈ సభతో దేశం, జనసేన ప్రభుత్వానికి బాటలు వేద్దాం అని రమణబాబు అన్నారు.

## విలీన మండలాల్లో మొట్టమొదటి మహిళా డాక్టరేట్ తీసుకున్న తేజశ్రీ



**చింతూరు, మేజర్ న్యూస్ :** విలీన మండలాల్లో మొట్టమొదటి మహిళా డాక్టర్‌గా పండా తేజశ్రీ గుంటూరు మెడికల్ కాలేజీలో మంగళవారం పట్టా పొందారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 8 మండలాల్లో గిరిజనుల్లో మొట్టమొదటిగా తెల్లం వెంకటరావు, రెండవ డాక్టర్‌గా శ్యామల సోమరాజు పురుషులు కాగా, మూడో వ్యక్తిగా మహిళ పండా తేజశ్రీ డాక్టర్ పట్టా పొందారు. తేజశ్రీ తండ్రి పండా రామకృష్ణ చింతూరులోని తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. గిరిజన కుటుంబంలో పుట్టి డాక్టర్ పట్టా పొందిన తేజశ్రీని పలువురు అభినందిస్తున్నారు.

## రక్త దానానికి యువతీ యువకులు ముందుకు రావాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని యువతీయువకులు అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి ముందుకు రావాల్సిందిగా రంపచోడవరం ఐటీడీఏ ఏపీఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో అత్యవసర సమయంలో రోగులకు రక్తం ఎక్కించుటకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సూచనల మేరకు ఐటీడీఏ అధికారులు, సిబ్బందితో బ్లడ్ డొనేషన్ క్యాంపు మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీవో జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసిన వారికి వెంటనే రక్తం ఎక్కించుటకు ఐటిడిఏ అధికారులు, కార్యాలయం సిబ్బంది మానవత్వంతో స్వచ్ఛందంగా బ్లడ్ డొనేట్ చేయడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాల నుండి వివిధ వ్యాధులతో స్థానిక ఏరియా ఆసుపత్రికి రోగులు రావడం జరుగుతుందని, అయితే అత్యవసర సమయంలో రక్తం కావలసిన రోగులకు వెంటనే ఎక్కించే విధంగా ఐటీడీఏ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లడ్ డొనేట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎక్కడైనా బ్లడ్ డొనేషన్ క్యాంపు ఏర్పాటు చేసినప్పుడు యువతీ యువకులు ముందుకు వచ్చి మానవత్వంతో స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బ్లడ్ డొనేషన్ క్యాంపు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఆదేశాలు మేరకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి డి.యన్.వి.రమణ, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ఎ.ఓ. రమణ, డాక్టర్ ముఖర్జీ, ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో లీగల్ సెల్ డిప్యూటీ తాహసిల్దార్ స్వామి, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. విభాగం జి.ఆనంద్, నాగభూషణం తదితరులు రక్తదానం చేయడం జరిగింది.

## ప్రత్తిపాడు సభను విజయవంతం చేయాలని కోరుతూ తెదేపా జనసేన నాయకుల ప్రచారం



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 28వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3-00 గంటలకు తాడేపల్లిగూడెం ( ప్రతిపాడు) నందు తెలుగు దేశం మరియు జనసేన పార్టీ ల ఉమ్మడి భారీ బహిరంగ సభ జరుగుతుందని ఈ సభలో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మరియు జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ పాల్గొంటారు. కావున ఈ కార్యక్రమంలో నిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశం మరియు జన సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు, ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా పెరవలి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన తెదేపా జనసేన కార్యకర్తలను నాయకులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 27వ తేదీ మంగళవారం ఇరు పార్టీలకు చెందిన నాయకులు పెరవలి మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి నాయకులను కార్యకర్తలను ప్రత్తిపాడు సభకు వెళ్లేందుకు సమాయత్తం చేశారు. నిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశం మరియు జన సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు, ప్రజలు అందరూ బుధవారం మధ్యాహ్నం 1-00 గంటలకు వేలివెన్ను గ్రామంలో పెట్రోల్ బంకు ప్రక్కన గల స్థలం వద్దకు చేరుకొని అక్కడనుండి నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషా రావు మరియు నిడదవోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ బోగవల్లి ప్రసాద్ ఆధ్వర్యం లో భారీ ర్యాలీ గా బయలుదేరి బహిరంగ సభ కు బయలుదేరుదామని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పెరవలి మండల పార్టీ అధ్యక్షుడు పిప్పర రవి తెలుగుదేశం పెరవలి మండల పార్టీ అధ్యక్షుడు అతికాల కృష్ణమ్మ జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్ నందిప శ్రీనివాస చక్రవర్తి తెదేపా నాయకులు నల్లాకులవెంకటేశ్వరరావు కోటా శ్రీను కోపెల్ల చినబాబు కంటిపూడి సూర్యనారాయణ దొరస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- విజేతలుగా ప్రకాశం, విజయనగరం జిల్లాలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వేదికగా గత మూడు రోజులుగా జరిగిన వై ఎస్ ఆర్ మెమోరియల్ అంతర్ జిల్లాల ఖోఖో పురుషులు, మహిళల పోటీలు సోమవారం రాత్రి ఘనంగా ముగిసాయి. విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, నిర్వాహక కమిటీ కార్యదర్శి ఊబా జాన్ కెనడి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్మిక నాయకులు, వైసీపీ సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లోని 13 జిల్లాల నుంచి పురుషులు, మహిళలు 13 టీమ్ లు చొప్పున పోటీల్లో పాల్గొనగా మహిళా, పురుషుల విభాగాల నుంచి ప్రకాశం జిల్లాకు చెందిన టీములు విన్నర్స్ గా నిలవగా మహిళల విభాగం నుంచి రన్నర్స్ గా కృష్ణ జిల్లా టీము, పురుషుల విభాగం నుంచి రన్నర్స్ గా విజయనగరం జిల్లా టీము నిలిచాయి. రాత్రి వరకూ కొనసాగిన ఫైనల్ పోటీల్లో జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమం రాష్ట్ర కార్మిక నాయకులు సుబ్బారావు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ల చేతుల మీదుగా విజేతలైన టీములకు ట్రోఫీలు, సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఖోఖో ఉభయ గోదావరి జిల్లాల సంఘం కార్యదర్శి కె పట్టాభి రామ్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో విన్నర్స్ గా నిలిచిన పురుషులు, మహిళా టీములు మార్చి 27 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు ఆవాల లక్ష్మి నారాయణ, జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి, ఖోఖో రాష్ట్ర అధ్యక్షులుటి ఎస్ ఆర్ కె ప్రసాద్, కార్యదర్శి సీతారామరెడ్డి, జాతీయ కోచ్ పోతుల సాయి, వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ చంటిబాబు, మున్సిపల్ కో అప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, పి ఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ స్టీవెన్ కింగ్, మాల మహానాడు నాయకులు లింగం శివ ప్రసాద్, వ్యాయామోపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు, ఎండివి ప్రసాద్, కౌన్సిలర్ లు పాగా సురేష్ కుమార్, సేపేని సురేష్, రెడ్డి లోవకుమారి, నిర్వాహక కమిటీ నాయకులు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పురుషులు, మహిళలు జట్లు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- ఆర్డీఓ మరియు ఈఆర్వో సీతారామారావు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఎన్నికల విధుల పట్ల బిఎల్‌ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో బిఎల్‌ఓలకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నియోజకవర్గంలోని సామర్లకోట పట్టణ, రూరల్ పరిధిలో గల బిఎల్‌ఓలకు, అధికారులకు, సిబ్బందికి ఎన్నికలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రధానంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆర్డీఓ హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఈఆర్వో సీతారామారావు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, బిఎల్‌ఓలు,పాల్గొన్నారు.

## సత్యదేవునికి భూరివిరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి అలంకార నిమిత్తము ఒక భక్తుడు భూరివిరాళం సమర్పించారు. స్వామివారికి, అమ్మవారికి మరియు ఈశ్వరునకు సుమారు 17 లక్షల 50 వేల రూపాయలు విలువైన బంగారు ఆభరణాలు మరియు స్వామివారి నిత్యాన్న ప్రసాద పథకమునకు ఐదు లక్షలు, గోసంరక్షణ ట్రస్టునకు రెండు లక్షలు మొత్తం సుమారుగా 25 లక్షలు భూరి విరాళమును విశాఖపట్నం వాస్తవ్యులు స్వామివారికి సమర్పించారు. వేద పండితులు భక్తుని కుటుంబసభ్యులకు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

## ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించిన ఓపెన్ ల్యాబ్ డే



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మంగళవారం స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా ఓపెన్ ల్యాబ్ డే నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ చంద్ర ఆర్కే తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను డిగ్రీ కళాశాలల ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ జాతీయ సైన్స్ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను మరియు స్వదేశీ విజ్ఞానం-వికసిత భారత అభివృద్ధి గురించి తెలియజేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన నమూనాలు ఆసక్తిగా తిలకించారు. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్ -3 నమూనా, అవరోధాలను గుర్తించే రోబో, రసాయన శాస్త్రం నుండి పర్యావరణ హిత ప్లాస్టిక్, అమ్ల వర్షాలు, మైక్రో బయాలజీ విభాగం నుండి జన్యు మార్పిడి ద్వారా ఉత్పత్తి అయ్యే పంటలు, కలుషిత ఆహార మును గుర్తించు విధానం, సాంఖ్యక శాస్త్ర విభాగం నుండి సైబర్ క్రైమ్‌లో రకాలు, కృత్రిమ మేధ, వృక్ష శాస్త్రం విభాగం నుండి ప్రకృతి సేద్యం మరియు సమీకృత సేద్యంలో రకాలు, జంతు శాస్త్రం నుండి గుండె మరియు మూత్ర పిండాలు పనిచేసే నమూ నాలు, భూగోళ శాస్త్రం విభాగం నుండి ఖండ చలన సిద్దాంతం మరియు అగ్ని పర్వత విస్ఫోటన నమూనాలు అదేవిధంగా భు విజ్ఞాన శాస్త్రం నుండి పునరుత్పాదక శక్తి వనరుల నమూనాలు మరియు ఖనిజ సమ్మేళనాలు ప్రదర్శించారు. సదరు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే వాసుదేవ రావు నేతృత్వంలో నగరంలోని వివిధ స్కూల్స్ నుండి విద్యార్థులు విచ్చేసి ప్రదర్శనలు తిలకించారు. ఈ కార్యక్రమం ఇన్స్టిట్యూట్ ఇన్నోవేటివ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగిందన్నారు.



## 4న సర్వసభ్య సమావేశం

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి 4న నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.రమేష్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తామని తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణంలో మధ్యాహ్నం 3గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని ఎంపీడీఓ కోరారు. చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళిలు, అభివృద్ధి నివేదికలతో హాజరవ్వాలని కోరారు.



## పార్టీకి కార్యకర్తలే వెన్నుముక

**- హెంమంత్రి తానేటి వనిత**

**గోపాలపురం, మేజర్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం, వారే పార్టీకీ వెన్నెముక అని రాష్ట్ర హెం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. రాష్ట్రంలో 175 కి 175 స్థానాలు గెలవాలనే లక్ష్యంతో తమ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల్లో పర్యటించిన ఆమె పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యకర్తలు మీద నమ్మకంతోనే ముఖ్యమంత్రి తనను గోపాలపురం నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించారని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా ద్వారకా తిరుమల మండలం తిమ్మాపురం పర్యటనలో గ్రామానికి చెందిన బయ్యరపు ఏడుకొండలు అనే కార్యకర్త ఇటీవల మృతి చెందిన విషయం హెంమంత్రి దృష్టికి తీసుకురాగా..వెంటనే ఆ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చాను.

# పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాపై కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు నియోజక వర్గాల వారీగా సమస్యాత్మక , హేతుబద్ధీకరణ పోలింగ్ కేంద్రాలను గుర్తించడంలో రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నివేదిక అందజేయ్యాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత అదేశించారు. మంగళవారం కలక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఏడు నియోజక వర్గాల రిటర్నింగ్, సహయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివో లతో వలనారబుల్, రేషనలైజేషన్ పోలింగ్ కేంద్రాలు , ఫారం 6 , 7 , 8 పరిష్కార స్థాయి తదితర అంశాలపై జూమ్ కాన్ఫరేన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిలో ఓటరు జాబితా అనుగుణంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకణ పై నివేదిక అందజేయ్యాలని కోరారు. 1500 పై బడి ఓటర్లు , ఓటర్ల నివాస ప్రాంతం నుంచి దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల కు తగిన కారణాలు తెలియ చేస్తూ ప్రతిపాదనలు పంపాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి వల్నరబిలిటీ , సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి చెయ్యాలని మాధవీలత తెలియ చేశారు. రాజానగరం నియోజక వర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు గానూ 10 వల్నరబిలిటీ పోలింగ్ కేంద్రాలు , 50



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. రాజానగరం నియోజక వర్గ పరిధిలో ఆయా పోలింగ్ కేంద్రాలను నిర్ధారణ చేస్తూ నివేదిక అందచేశారని పేర్కొన్నారు. మిగిలిన ఆరు నియోజక వర్గాల పరిధిలో కూడా ఆమేరకు తనిఖీలు నిర్వహించి సంపూర్ణ నివేదికలు పంపించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు అనపర్తి నియోజక వర్గంలో 228 పోలింగ్ కేంద్రాలలో 67 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. రాజమండ్రీ సిటీ నియోజక వర్గంలో 232 పోలింగ్ కేంద్రాలకు గానూ 13 వల్నరబిలిటీ పోలింగ్ కేంద్రాలు , 36 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. రాజమండ్రీ రూరల్ నియోజక వర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు గానూ 7 వల్నరబిలిటీ పోలింగ్ కేంద్రాల , 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. కొవ్వూరు (ఎస్ సీ) నియోజక వర్గంలో 176 పోలింగ్ కేంద్రాలలో 35 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. నిడదవోలు నియోజక వర్గంలో 205 పోలింగ్ కేంద్రాలలో 41 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. గోపాలపురం (ఎస్ సీ)నియోజక వర్గంలో 248 పోలింగ్ కేంద్రాలలో 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తించడం జరిగిందన్నారు. మరోసారి క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్ధారణ చేసి నివేదిక అందజేయ్యాలని స్పష్టం చేశారు. త్వరలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న దృష్ట్యా ఓటరు జాబితాకి సంబందించి వస్తున్న దరఖాస్తులను ఎప్పటి కప్పుడు పరిష్కరించడం చాలా ముఖ్యం అన్నారు. ఓట్ల తొలగింపు విషయంలో మరణించిన వారికి చెందిన డెత్ సర్టిఫికెట్ నిర్ధారణ చేసుకోవడం, చిరునామా మార్పు తగిన పత్రాలు స్వీకరించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని, ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలి అని మాధవీలత పేర్కొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేదే లేదు

- స్థలము లేకుండా పట్టాలెందుకు..?
- ప్రజలకు న్యాయం జరిగేంతవరకు పోరాడతాం
- నల్లమిల్లి



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి మండలంలో, ఇళ్ల స్థలాల పేరుతో చెల్లుబాటు కానీ పట్టాలను సిద్ధం చేసి ప్రజలను మోసం చేసే కార్యక్రమం అధికార పార్టీ చేపడుతుంటే ఆ కార్యక్రమాన్ని అడ్డుకుని సాక్షాదారాలతో సహ నిరూపిస్తే ఈ రోజును మాపై అక్రమ కేసులు నమోదు చేయడం జరిగిందని, ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడేది లేదని, ప్రజలకు న్యాయం జరిగేంతవరకు మా పోరాటం ఆగదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డమ్మీ పట్టాల వ్యవహారంపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఉన్నతాధికారులు కూడా నిమ్మకు నీరట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మండల తహశీల్దార్ కార్యాలయానికి ప్రజలకు పంచేందుకు బోగస్ పట్టాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇళ్ల స్థలాలు లేకుండా బోగస్ పట్టాలను ప్రజలకిచ్చి ప్రజలను మోసం చేసే కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అసలు యజమానులకు ఏ విధమైన పరిహారం ఇవ్వకుండా ఆ భూమిని ఇండ్ల స్థలాలుగా విభజించ కుండా పట్టాలు పంపిణీ చేయడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. బోగస్ పట్టాలను పట్టుకున్నందుకు గాను మాపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఇప్పటివరకు నాపై 37 అక్రమ కేసు నమోదు చేయడం జరిగిందని ఎన్ని కేసులు నమోదు చేసిన భయపడేది లేదని అన్నారు. ఈ డమ్మీ పట్టాల వ్యవహారంపై అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై కేసు నమోదు చేయడం, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరుగుతుందని అన్నారు. మండల తాసిల్దార్ కార్యాలయం బోగస్ పట్టాలను తగలబెట్టి, కార్యాలయం ముందు బైఠాయించి బోగస్ పట్టాలు పంపిణీ వద్దు ప్రజలను మోసగించొద్దు అని నినాదాలు చేశారు. డమ్మీ పట్టాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు అని గ్రామపుర వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.20 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం

- స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ వెంకటరావు
- నేడు ఎమ్మెల్యే కన్నబాబుతో ప్రారంభం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రూ.20 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో కాకినాడ సురేష్‌నగర్‌లో కన్వర్టబుల్ స్టేడియం నిర్మించినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్‌సిటీసీఈవో, ఎండి జె.వెంకటరావు తెలిపారు. ఈ కన్వర్టబుల్ స్టేడియంను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు ప్రారంభిస్తారన్నారన్నారు. స్టేడియం ప్రారంభ ఏర్పాట్లను స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ వెంకటరావు మంగళవారం సాయంత్రం పర్యవేక్షించారు.స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ బ్యాట్మింటన్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, జూడో, కబడ్డీ, ఖో–ఖో, టెన్నిస్, టైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ వంటి ఇండోర్ క్రీడా పోటీలకు అనువుగా ఈ స్టేడియంను నిర్మించామన్నారు. ఇక్కడ సుమారు 1200 సీట్ల సామర్థ్యంతో ఆయా క్రీడాపోటీలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. స్టేడియంలో టేబుల్ టెన్నిస్, ఇతర బోర్డు గేమ్స్ ఆడేందుకు ప్రత్యేక హాల్ కూడా నిర్మించామన్నారు. పురుషులు, మహిళా క్రీడాకారుల కోసం డ్రెస్ చేంజింగ్‌రూమ్స్, లాకర్స్, ఫస్ట్ ఎయిడ్‌రూమ్, వీడియోకాన్ఫరెన్స్‌రూమ్, టాయ్‌లెట్స్ వంటి అన్ని సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ వంగా గీత, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి తోపాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని కమిషనర్ వెంకటరావు చెప్పారు.

### ప్రజాస్వామ్య పరిరక్షణకు పొత్తు ధర్మం పాటించాల్సిందే

**- జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ**




**వి.ఆర్.పురం,మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ కావాలంటే త్యాగాలు చేయాల్సి ఒదేనని, జనసేన పార్టీ,మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, కార్యకర్తలకు ఉద్బోధ చేశారు. మంగళవారం, మండల పరిధిలోని ముక్యమైన నాయకులు,పవన్ కళ్యాణ్, అభిమానులకు, పార్టీ శ్రేణులు తన స్వగృహంలో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ! ప్రజల్లోంచి పుట్టిన జనసేన పార్టీని పటిష్టపరిచేందుకు పవన్ కళ్యాణ్, అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కన్ఫ్యూజ్ కావద్దని వచ్చేది జనసేన, తెలుగుదేశం, ప్రభుత్వమేనని,ఇది 100%నిజమని సమన్వయం పాటించాలని సూచించారు. టికెట్ ఎవరికి ఇచ్చినా పొత్తు ధర్మాన్ని పాటించాలని కార్యకర్తలను,నాయకులను, అభిమానులను, కోరారు.ఈ 50 రోజులు ప్రజల్లో ఉండాలని, ఉమ్మడిప్రణాళిక ఏర్పాటుచేసుకోని ప్రజలను చైతన్య వంతులను చేయాలని కోరారు. పార్టీలో ప్రతీ ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిని నమ్మొద్దని సూచించారు. తాడేపల్లి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో భారీగా పవన్ కళ్యాణ్, అభిమానులు ,జనసేన పార్టీ, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

### రాజమండ్రి రూరల్ కదం తొక్కిన జనసైనికులు

**- రాజమండ్రి రూరల్ సీట్ కందుల దుర్గేష్‌కి ఇవ్వాలి...**

**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం




రూరల్ జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తాజా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరికి కేటాయించడంతో రూరల్ జనసేన కార్యకర్తలు నిరసనలతో హెూరెత్తించారు. రాజమహేంద్రవరం రూరల్ కడియం దేవి చౌక్ వద్ద నుండి ఆర్ అండ్ బి రోడ్డుపై వేమగిరి, ధవళేశ్వరం, ఐ ఎల్ టి డి, రైల్వే స్టేషన్ కోటిపల్లి బస్టాండ్ మీదుగా రాజమండ్రి డీలక్స్ సెంటర్ వరకు శాంతియుతంగా పాదయాత్ర చేపట్టారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**- మార్చ్ 18 నుంచి 30 వరకు నిర్వహణ - డివైఇఓ ఆర్.జె.డి.రాజు**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ ఎగ్జామ్స్ విభాగం ఏర్పాట్లు పూర్తి చేసిందని దానిలో భాగంగా పెద్దాపురం డివిజన్ పరిధిలో రెగ్యులర్ 11,087మంది, ప్రైవేటు 1758మంది మొత్తం 12,845 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు పిఠాపురం డివైఇఓ (ఇన్‌చార్జి) ఆర్.జె.డి.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ డివిజన్ పరిధిలో పెద్దాపురంలో 7, జగ్గంపేట 6, ప్రత్తిపాడు 5, కిర్లంపూడి 5, శంఖవరం 5, రౌతులపూడి 3, తొండంగి 3, కోటనందూరు 3, తుని 11, ఏలేశ్వరం 4, గండేపల్లి 3 మొత్తం 55 సెంటర్‌లలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు డివైఇఓ ఆర్‌జెడి రాజు తెలిపారు. అంతేగాకుండా ప్రధాన పరీక్షలు మార్చ్28వ తేదితో ముగుస్తాయని, ఆ తరువాత రెండు రోజులు ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 8.45 నుండి 9.30 వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం క్యూఆర్ కోడ్‌తో పేపర్ లీక్‌లు అవ్వకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, పదవ తరగతి పరీక్షలలో మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఈ ఏడాది ప్రశ్నాపత్రాలను ప్రత్యేక టెక్నాలజితో రూపొందించడం జరిగిందని, ప్రతీ పేపర్‌పైన, ప్రతీ ప్రశ్నకు క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం జరుగుతుందని, దీంతో మాల్ ప్రాక్టీస్ చేసినా, పేపర్ లీక్ చేసినా, దీంతో ఏ సెంటర్‌లో ఏ విద్యార్థికి కేటాయించినది వెంటనే తెలిసిపోతుందని ఆయన తెలిపారు. అలాగే పదవ తరగతి పరీక్షలకు వెళ్ళే విద్యార్థులకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందని, విద్యార్థులు పదవ తరగతి హాల్ టికెట్ చూపించి, తమ ఇంటి నుండి పరీక్షా కేంద్రాలకు ఆల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, సిటి, ఆర్డీనరీ బస్‌లలో ఉచితంగా వెళ్ళి రావచ్చునని ఈ సదుపాయం ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కూడా కల్పించడం జరిగిందని, కావున విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని, ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని డివైఇఓ ఆర్‌జెడి రాజు సూచించారు.

## ఓటింగ్ శాతం పెరిగేలా ఓటర్లలో అవగాహన పెంచాలి



- గత ఎన్నికల్లో తక్కువ ఓటు శాతం నమోదు అయిన పి ఎస్ వారీగా ప్రణాళికలు సిద్ధం చెయ్యాలి
- బి ఎల్ వోలు ఇంటింటికి తిరిగి చైతన్యం తీసుకుని రావాలి
- ఈవిఎమ్‌లపై అవగాహన కల్పించాలి
- ఓటర్లతో కలెక్టర్ ముఖాముఖి సంభాషణ
- కె.మాధవీలత

**రాజానగరం, మేజర్ న్యూస్ :** ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని , ఆమేరకు ఓటర్ల లో అవగాహన పెంచాల్సి ఉందని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి కె. మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాజానగరం నియోజక వర్గం పరిధిలో దీవాన్ చెరువు, లాలా చెరువు ప్రాంతాలలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువ గా నమోదు అయిన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో నియోజక వర్గాల వారీగా తక్కువ ఓటు నమోదు చేసిన పి ఎస్ లను గుర్తించి, అక్కడ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ను చెప్పట్టాల్సి ఉందన్నారు. ఆ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసెందుకు పర్యటించినట్లు పేర్కొన్నారు. ఓటర్ల లో చైతన్యం తీసుకుని రావడం కోసం తగిన ప్రణాళికలు, కార్యచరణ సిద్ధం చెయ్యాలని అధికారులని ఆదేశించారు. బి ఎల్ వో లు ఇంటింటికి తిరిగి చైతన్యం తీసుకుని రావాలన్నారు. ఇప్పటికే ఈ వి ఎమ్ లపై అవగాహన కల్పించడం జరిగిందనీ, రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. లాలా చెరువు పరిధిలోని 142, 143, 144, 146 , 147 , దివాన్ చెరువు పరిధిలోని 136 , 137 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగు శాతం పై బూత్ వారీగా సమీక్ష నిర్వహించారుకలెక్టర్ వెంట రాజానగరం ఆర్ వో / రాజమండ్రీ ఆర్డీవో ఏ. చైత్ర వర్షిణి , తహసీల్దార్ జీ. కనక రాజు, బి ఎల్ వో లు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో ఇంటి వద్దే ఈ కేవైసి చెయ్యాలి

**- గృహేతర అవసరాలకు డొమెస్టిక్ ఎల్‌పిజీ వినియోగం నిషిద్ధం -జేసీ తేజ్ భరత్**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గ్యాస్ ఏజెన్సీల వారు గ్యాస్ సిలండర్ల వినియోగంలో వినియోగదారుల భద్రత, సౌలభ్యం నిమిత్తం ప్రభుత్వం వారు నిర్దేశించిన నియమ నిభందనలను తప్పక పాటించుట, ఈ కేవైసి చేయుట పై వినియోగదారులకు అవగాహన కల్పించుట అత్యంత అవశ్యం అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు. మంగళవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో గ్యాస్ డీలర్స్ ఏజెన్సీ ప్రతినిధులతో పౌర సరఫరాలు శాఖా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆ క్రమంలో "ఈ కెవైసి " కోసం వినియోగదారులను గ్యాస్ ఏజెన్సీల వద్దకు రప్పించకుండా, వారి ఇంటి వద్ద మాత్రమే గ్యాస్ సిలిండరు డెలివరీ చేయు సమయంలో డెలివరీ బోయ్ సదరు యజమాని యొక్క "ఈ కెవైసి" నమోదు చేయాలని ఆమేరకు సంభందిత డెలివరీ బాయ్స్‌కి సూచనలు చేయాలన్నారు.గ్యాస్ సిలిండరు డెలివరీచేయునపుడు అదనపు చార్జీలు వసూలు చేయకూడదని పేర్కొన్నారు. డెలివరీ సమయంలో గ్యాస్ రీఫిల్ బరువు, సీల్ నిర్ధారణ చెయ్యడం, గుగూల్/ఫోన్ పే/ పేటియం వగైరా డిజిటల్ విధానంలో చెల్లింపులు కోసం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తప్పనిసరిగా రశీదు జారీ చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్స్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చెయ్యాల్సిఉందన్నారు. డొమెస్టిక్ సిలిండర్లును గృహ అవసరాలకు తప్ప వేరే వాటికి డెలివరీ చెయ్యకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు.ఈ సమావేశం లో జిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, 26 మంది గ్యాస్, ఆయిల్ ఏజెన్సీ ప్రతినిథులు పాల్గొన్నారు.




## చంద్రబాబు నిర్ణయమే మాకు శిరోధార్యం

- కాకినాడ రూరల్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తాం
- టీడీపీ సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :**పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధినేత చంద్రబాబు నిర్ణయం మాకు శిరోధార్యమని, ప్రతి కార్యకర్త అధిస్టానం మాటకు కట్టు బడాల్సిందేనని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ అభ్యర్థిగా జనసేన ప్రస్తుత ఇనచార్జిగా ఉన్న పంతం నానాజీని అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో కాకినాడ రూరల్ పార్టీ అధ్యక్షులు రాందేవు సీతయ్య దొర ఆధ్వర్యంలో మంగళవారం ఆయన కాకినాడ జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమం కోసం టీడీపీ–జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు వివిధ రకాల సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. నవరత్నాల కింద పంచినది, దోపిడీ చేసింది లెక్కేస్తే ప్రజలకే జగనే బాకీ ఉంటారని, కేవలం నవరత్నాలు ఇస్తే జీవితాలు మారతాయనుకుంటే భ్రమే అన్నారు. టీడీపీ హయాంలో పేదల సంక్షేమానికి ఏర్పాటు చేసిన పలు పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

అన్న క్యాంటీన్‌లు, క్రిస్‌మస్, రంజాన్, సంక్రాంతి కానుకలను రద్దు చేశారన్నారు. చంద్రబాబు పెళ్లి కానుక, చంద్రన్న బీమా.. ఇలా అన్ని పథకాలను రద్దు చేయడం ద్వారా పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళా సాధికారిత, ఆర్థిక స్వాలంబన కోసం డ్వాక్రా గ్రూప్‌లు ఏర్పాటు చేసి, వారిలో చైతన్యం నింపిన ఘనత టీడీపీదేనన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేస్తే దేశ విదేశాలలో తెలుగువారు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారన్నారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగుతోందని... త్వరలోనే టీడీపీ–జనసేన అధ్వర్యంలో సురక్ష పాలన రానుందని నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బొంతు నాగేశ్వరరావు, దంగేటి వెంకటరమణ, మాజీ వైస్ సర్పంచ్ పాలిక రామ్మోహన్, నాయకులు పాలిక సింహాచలం, దమ్ము నూకరాజు, కోరాడ రాము, కోరాడ నరసింహ మూర్తి పామల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవునికి భూరివిరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి అలంకార నిమిత్తము ఒక భక్తుడు భూరివిరాళం సమర్పించారు. స్వామివారికి, అమ్మవారికి మరియు ఈశ్వరనకు సుమారు 17 లక్షల 50 వేల రూపాయలు విలువైన బంగారు ఆభరణాలు మరియు స్వామివారి నిత్యాన్న ప్రసాద పథకమునకు ఐదు లక్షలు, గోసంరక్షణ ట్రస్టునకు రెండు లక్షలు మొత్తం సుమారుగా 25 లక్షలు భూరివిరాళమును విశాఖపట్నం వాస్తవ్యులు స్వామివారికి సమర్పించారు. వేద పండితులు భక్తుని కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

### ఈ నెల 29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఈ నెల 29వ తేదిన గురువారం ఉదయం 11 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రెండవ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి సుబ్రహ్మణ్యేశ్వరరావుతో పాటు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

### సారాయి బట్టీపై దాడులు

- నిందితుడుకి 15రోజులు రిమాండ్
- ఎస్సై రఘునాథరావు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని మారేడుబాక గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమముగా సారాయి బట్టి నిర్వహిస్తున్నమారేడుబాక గ్రామానికి చెందిన బెన్నోజు.లోవకుమార్‌ని మంగళవారం ఉదయంఅరెస్టు చేసి అతని వద్ద 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారా యిని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జడ్డంగి ఎస్సై రఘునాథరావు తెలిపారు. నిందుతున్ని రిమాండ్ నిమిత్త ముఅడ్డతీగల జె ఎఫ్ సీఎం కోర్టుకు తరలించగా మేజిస్టేట్ 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సైతెలి పారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలలో సారాయి విక్రయించిన, తయారుచేసిన సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు. అలానే పేకాట గుండాట కోడిపందాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.